RNI No. APTEL/2010/ 36692 AKSHARA PRAKASAM aksharaprakasam@gmaiil.com

అక్షర ప్రకాశం

Published From Prakasam People News Paper

సంపుటి : 15 సంచిక : 311 సెప్టెంబర్ 30 బుధవారం 2026 ప్రకాశం పేజీలు : 4 వెల - 2

పల్లె పండుగ 3.0 ప్రారంభం..

గ్రామాలకు రూ. 11,085 కోట్లు

- ఉదయగిరిలో 'పల్లె పండుగ-3' కార్యక్రమాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ.1,185 కోట్లు కేటాయించినట్లు ప్రకటన
- గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో తమ రెండేళ్ల పాలనను పోల్చిన ముఖ్యమంత్రి
- వెలిగొండ ఫేజ్-2 పూర్తితో పాటు ఉదయగిరి ప్రాంతానికి పలు ప్రాజెక్టులు మంజూరు
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనే ఎన్డీయే ప్రభుత్వ మంత్రమని స్పష్టీకరణ



ఉదయగిరి, సెప్టెంబర్ 29 : రాష్ట్రంలోని పల్లెల్లో నవోదయానికి నాంది పలుకుతూ ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'పల్లె పండుగ-3' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం రామాపురంలో జరిగిన సభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన కోసం రూ.11,085 కోట్లతో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. డబుల్ ఇంజన్ సర్కార్ జెట్ స్పీడ్‌తో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. "2024 ఎన్నికల్లో ప్రజలు మాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాం. మీరు వేసిన ఒక్క ఓటు కూడా వృథా కాలేదు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనతో రాష్ట్రాన్ని తిరిగి గాడిలో పెట్టాం. నా అనుభవం, పవన్ కల్యాణ్ గారి ఉత్సాహం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం" అని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలు విధ్వంసానికి గురయ్యాయని, రోడ్లు గుంతలమయమై, వీధి దీపాలు వెలగని దుస్థితి ఉండేదని ఆయన విమర్శించారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణంలో రికార్డు

'పల్లె పండుగ-3'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 15,500 కిలోమీటర్ల బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామని సీఎం వివరించారు. మరో రూ.2,700 కోట్లతో 6,000 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మిస్తామని, ప్రతి ఇంటి ముందూ బురద లేని రోడ్లు ఉండేలా చూస్తామని హామీ ఇచ్చా రు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 880 కిలోమీటర్ల రోడ్లు వేస్తే, తమ ఎన్డీయే ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే 6,500 కిలోమీటర్ల రోడ్లు వేసి చరిత్ర సృష్టించిందని పోల్చి చెప్పారు. "అప్పుడు ఖర్చుపెట్టిన డబ్బులు దొంగల జేబుల్లోకి పోయాయి, ఇప్పుడు మేము ఖర్చుపెట్టే ప్రతి పైసా మీ ఊరిలో అభివృద్ధి రూపంలో కనిపిస్తోంది," అనిచంద్రబాబు వ్యాఖ్యానించారు.

పవన్ నాయకత్వంలో పంచాయతీరాజ్ అద్భుతం

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పంచాయతీరాజ్ శాఖ అద్భుతమైన మార్పులు తీసుకొచ్చిందని సీఎం ప్రశంసించారు. రెండున్నర దశాబ్దాల తర్వాత 10,000 మందికి పదోన్నతులు కల్పించడం, నిలిచిపోయిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.4,136 కోట్లు విడుదల చేయించడం వంటి విజయాలను ఆయన గుర్తుచేశారు. పంచాయతీరాజ్ శాఖకు 13 జాతీయ అవార్డులు రావడం పవన్ పనితీరుకు నిదర్శనమని కొనియాడారు.

ఉదయగిరికి వరాల జల్లు

ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పలు కీలక ప్రాజెక్టులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు.

65,000 ఎకరాలకు సాగునీరు అందించే పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్ కాలువ పనులకు రూ.52.52 కోట్లు.

90,000 ఎకరాలకు సాగునీరు, 2.35 లక్షల మందికి తాగునీరు అందించే సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-1 భూసేకరణకు రూ.85 కోట్లు.

రూ.3,876 కోట్ల పెట్టుబడితో 5,100 మందికి ఉద్యోగాలిచ్చే డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఉదయగిరిని తీర్చిదిద్దేందుకు అవసరమైన క్లియరెన్సులు.

కనిగిరిలోని 189 ఫ్లోరైడ్ గ్రామాల సమస్య పరిష్కారానికి రూ.100 కోట్లు.

వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్-2ను పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

సంక్షేమం, అభివృద్ధి మా మంత్రం

ఎన్నికల్లో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను నిలబెట్టుకున్నామని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రూ.4,000 పెన్షన్ వంటి పథకాలతో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. రూ.10 లక్షల కోట్ల అప్పులతో వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వ సహకారంతో బయటకు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, దీని ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. అభివృద్ధికి ఎవరైనా అడ్డువస్తే ఉపేక్షించేది లేదని, సుస్థిర ప్రభుత్వంతోనే నిరంతర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏల్చూరి ఏడుకొండలు దాతృత్వం: శ్రీ దత్త సాయి సన్నిధికి వంట సామాగ్రి విరాళం

చిలకలూరిపేట, అక్షర ప్రకాశం : స్థానిక ప్రముఖ ఆధ్యాత్మిక, సామాజిక సేవా సంస్థలైన శ్రీ దత్త సాయి అన్నదాన సమాజం, జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దత్త సాయి సన్నిధి అన్నదాన కార్యక్రమాలకు గాను ఏపీ సీపీడీసీఎల్ (APCPDCL) విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (EE) ఏల్చూరి ఏడుకొండలు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. సన్నిధిలో భక్తులకు, నిరుపేదలకు అన్నప్రసాదాలు తయారుచేసేం దుకు అవసరమైన వంట పాత్రలు, ఇతర సామాగ్రిని ఆయన మంగళవారం (ఈరోజు) స్వయంగా నిర్వాహకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ సీపీడీసీఎల్ ఈఈ ఏల్చూరి ఏడుకొండలు మాట్లాడుతూ.. శ్రీ దత్త సాయి సన్నిధిలో ప్రతి గురువారం మరియు ఆధ్యాత్మిక వేడుకల సందర్భంగా విరామం లేకుండా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు. ఇటువంటి పవిత్రమైన సేవా కార్యంలో పాలుపంచుకోవడం తన పూర్వజన్మ సుకృతమని, తాను అందజేసిన సామాగ్రి అన్నదాన సేవలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్రీ దత్త సాయి సన్నిధి నిర్వాహకులు, కమిటీ సభ్యులు విద్యుత్ అధికారి ఏడుకొండలు సేవా గుణాన్ని శ్లాఘించారు. ఆయనకు సాయిబాబా వారి ప్రత్యేక ప్రసాదాన్ని అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. సమాజానికి మేలు చేసే మంచి వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక భావాలు ఉన్న ఏడుకొండలు గారు, వారి కుటుంబ సభ్యులు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నూతన వధూవరులు రాజేష్ -ఉష లను ఆశీర్వదించిన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్



అక్షర ప్రకాశం : చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామ వాస్తవ్యులు బోరుగడ్డ సుబ్బారావు కుమారుని వివాహం చర్చి నందు జరుగుచుం డగా ఆ వేడుకకు హాజరై నూతన వధూవరులు రాజేష్ –ఉష లను ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియ జేసిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్... ఈ వేడుకలో వారివెం ట తాటిమళ్ళ ఏసు పాదం, రాయి పూడి ఆనందరావు, కొమ్మతోటి తిక్కన్న, గుదే చిన్నబ్బాయి, చింతాబత్తిన నాగభూషణం తదితరులున్నారు.

తూర్పు పశ్చిమ జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల నమోదు

రంగంపేట, అక్షర ప్రకాశం : ఎన్నికల సంఘం, న్యూఢిల్లీ వారి ఆదేశానుసారం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్ల నమోదు జాబితా తయారు చేస్తున్నట్లుగా మండల తాసిల్దార్ పాపారావు పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లకు గాను అర్హత గల ఉపాధ్యాయులు నిర్ణయిత ఫోరం 19లో తాజాగా సంబంధిత తాసిల్దార్, ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయం నందు దరఖాస్తులు సమర్పించవచ్చ న్నారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కోనసీమ జిల్లా, పశ్చిమగోదా వరి జిల్లా, పోలవరం మరియు ఏలూరు జిల్లాల ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాల, అన్ ఎయిడెడ్ పాఠశాలలో, కళాశాలలో పనిచేస్తున్న అర్హత గల ఉపాధ్యాయులు, లెక్చరర్లు నమోదు చేసుకోవచ్చని, భారత దేశ పౌరుడై ఉండి, అదే నియోజకవర్గంలో నివాసం ఉన్నవారు 1- 11 -2026 నాటికి గడిచిన ఆరు సంవత్సరాలలో మూడు సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాల కళాశాల లో ఉపాధ్యాయునిగా, లెక్చరర్గా పనిచేస్తున్నట్లుగా ధ్రువీకరణ పత్రం విద్యాసంస్థల అధిపతి నుంచి తీసుకుని దరఖాస్తు చేయాలన్నారు.

రంగారెడ్డిపల్లిలో ఘనంగా పోషణ మాసోత్సవాలు - అంగన్వాడీ ఉత్సవం

రాచర్ల, అక్షర ప్రకాశం : మార్కాపురం జిల్లా రాచర్ల మండలం రంగారెడ్డిపల్లి గ్రామంలో సీడీపీఓ మహిత ఆధ్వర్యంలో అంగన్వాడీ ఉత్సవం, పోషణ మాసోత్సవాలు పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా స్థానిక మహిళలకు, లబ్ధిదారులకు పౌష్టికాహారం ప్రాముఖ్యత, తల్లీబిడ్డల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పిల్లల ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంత అవసరమో వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ వసంత కుమారి అంగన్వాడీ కార్యకర్తలు, స్థానిక మహిళలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

గిద్దలూరు విద్యా కమిటీల్లో టీడీపీకి ఏకగ్రీవ మద్దతు

గిద్దలూరు, అక్షర ప్రకాశం : అన్ని పాఠశాల విద్యా కమిటీల్లో టీడీపీ మద్దతుదారుల ఏకగ్రీవం.. గిద్దలూరులో కొత్త ఉత్సాహం. గిద్దలూరు నియోజక వర్గంలోని అన్ని పాఠశాలల్లో విద్యా కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. తెలుగుదేశం పార్టీ మరియు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి గారి ప్రోత్సాహంతో ఆయా పాఠశాలల్లో పార్టీ మద్దతుదారులు విద్యార్థుల సమక్షంలో దాదాపు అన్ని చోట్ల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాలల్లో మెరుగైన వసతులు, విద్యా ప్రమాణాల పెంపు లక్ష్యంగా విద్యా కమిటీలు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా పార్టీ నాయకులు సూచించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్లు, వైస్ చైర్మన్లకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

గురుకుల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్గా ప్రమీల

రంగంపేట, అక్షర ప్రకాశం : కాకినాడ జిల్లా, పిఠాపురం మండలం, పిఠాపురం గురుకుల పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్గా తూర్పుగోదావరి జిల్లా, రంగంపేట మండలం, కోటపాడు గ్రామానికి చెందిన నూతలపాటి ప్రమీల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థినీ, విద్యార్థులకు విద్యాభివృద్ధిలో ఉపాధ్యాయులతో సమైక్యంగా కలిసి కృషి చేస్తానని విద్యా కమిటీ చైర్మన్ ప్రమీల పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ ప్రమీలను ఉపాధ్యాయ బృందం తదితరులు ఘనంగా సత్కరించారు.

కొండపి నియోజకవర్గంలో రూ. 24.2 కోట్లతో 13 కనెక్టివిటీ రోడ్ల నిర్మాణం. మంత్రి స్వామి

టంగుటూరు, అక్షర ప్రకాశం : పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా కొండపి నియోజకవర్గంలో రూ. 24.2 కోట్లతో 13 కనెక్టివిటీ రోడ్లు నిర్మిస్తున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. పల్లె పండుగ 3.0 లో భాగంగా టంగుటూరు మండలం శివపురంలో NH 16 నుండి నాయుడుపాలెం రోడ్డు వరకు వయా శివపురం మీదుగా రూ.1 కోటి 95 లక్షలతో నిర్మించనున్న తారు రోడ్డు నిర్మాణానికి మంగళవారం నాడు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా కొండపి నియోజకవర్గంలో రూ. 24.2 కోట్లతో 13 కనెక్టివిటీ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో (2018 ఫిబ్రవరిలో) ఏషియన్ బ్యాంకు నుంచి పనులు తీసుకొచ్చామని, కానీ గత వైసీపీ అసమర్థ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఆ ప్రాంత ప్రజలు రోడ్ల నిర్మాణానికి నోచుకోలేదన్నారు. తిరిగి కూటమి ప్రభుత్వం అధికారాలోకి వచ్చాక మళ్లీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. పల్లె పండుగ 3.0 లో భాగంగా

రాష్ట్రంలో రూ. 11,085 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి డా. స్వామి తెలిపారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలకు కృషి చేస్తున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేశ్ కి ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయురాలు విజయకుమారి ఆశయ సాధనే ఆమెకు ఘన నివాళి: ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

- శ్రీహరికోట అంతరిక్ష కేంద్రాన్ని సందర్శించనున్న ప్రతిభావంతులైన విద్యార్థులు

గుంటూరు, అక్షర ప్రకాశం : విద్యార్థుల్లో సైన్స్, అంతరిక్ష విజ్ఞానం పట్ల ఆసక్తిని పెంపొందించడమే దివంగత ఉపా ధ్యాయురాలు రాచకొండ విజయకుమారి కి నిజమైన ఘన నివాళి అని శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ తెలిపారు. గత ఏడాది నవంబర్ 2న అకాల మరణం చెందిన తెలుగు ఉపాధ్యాయురాలు విజయకుమారి జ్ఞాపకార్థం, ఆమె భర్త శాంతమూర్తి ఆధ్వర్యంలో గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. విజయకుమారి జన్మదినాన్ని (సెప్టెంబర్ 25) పురస్కరించుకుని, ఆమె పనిచేసిన పాఠశాలల విద్యార్థులకు అంతరిక్ష విజ్ఞానంపై పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు, మెమొంటోలు ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ– విజయకుమారి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా విద్యార్థులు, తల్లిదండ్రుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఆమె అకాల మరణం కుటుంబానికి తీరని లోటని, అయినప్పటికీ ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ శాంతమూర్తి విద్యార్థులకు ప్రైజ్ మనీ ఇవ్వడమే కాకుండా శ్రీహరికోట రోదసి పరిశోధనా రంగాన్ని ఉచితంగా సందర్శించే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ సభ్యులు కే.ఎస్. లక్ష్మణరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకవీడు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులకు విరాళం

రాచర్ల, అక్షర ప్రకాశం : మార్కాపురం జిల్లా రాచర్ల మండలం ఆకవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడల్లో పాల్గొనే విద్యార్థినీ విద్యార్థుల కు స్పోర్ట్స్ దుస్తుల కోసం రూ. 18,000లను దాతలు మక్రీ Ch. శ్రీనివాసులు (రైల్వే లైన్ ఇన్స్పెక్టర్, కంభం) మరియు వారి సతీమణి Ch. నాగలక్ష్మి గార్లు విరాళంగా అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం. విజయ భాస్కర్ రెడ్డి ఉపా ధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ సూరా పాండురంగా రెడ్డి, మాజీ సర్పంచ్ ఎం. బ్రహ్మయ్య, మాజీ ఎంపీటీసీలు నందం రవికుమార్, గువ్వా పిచ్చయ్య, రిటైర్డ్ టీచర్ సూరా సత్యం రెడ్డి, సూరా ఆదినారాయణ రెడ్డి, యాసం లక్ష్మిరెడ్డి, కుప్పా వెంకటేశ్వర్లు, లోమడ మల్లికార్జున్, నాగం

నాగరాజ తదితరులు పాల్గొని దాత దంపతులను అభినందించారు.

ముత్తాయిపాలెంలో పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవాలు

బాపట్ల, అక్షర ప్రకాశం : ముత్తాయిపాలెం పంచాయతీ పరిధిలో పోషణ మాసం, అంగన్వాడీ ఉత్సవం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సమాజ సేవకురాలు రజనీ హాజరయ్యారు. గ్రామానికి చెందిన తల్లులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్వైజర్ పద్మావతి మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచనల మేరకు అంగన్వాడీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అంగన్వాడీ ఉత్సవాలను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. అంగన్వాడీల ద్వారా అందిస్తున్న సేవలపై లబ్ధిదారులతో మాట్లాడించడం, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించడం, అంగన్వాడీ కార్యకర్తలను సత్కరించడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని సూచించినట్లు వివరించారు. ముఖ్య అతిథి రజనీ మాట్లాడుతూ.. అంగన్వాడీల ద్వారా అందుతున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. పథకాలకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు, ఆధార్, ఫోన్ నంబర్ లింకింగ్ వంటి వివరాలను సక్రమంగా పూర్తి చేసుకుని ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందాలని తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలకు ప్రజలు సహకరించాలని, సమాజ భాగస్వామ్యంతోనే అంగన్వా డీల అభివృద్ధి సాధ్యమవు తుందని పేర్కొన్నారు. అనంతరం అంగన్వాడీ కార్యకర్తలను రజనీ శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో గ్రామ ప్రజలు, తల్లులు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

చినగానిపల్లె పాఠశాల చైర్మన్ గా బొల్లు రమాదేవి

రాచర్ల, అక్షర ప్రకాశం : మార్కాపురం జిల్లా రాచర్ల మండలంలోని చినగానిపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల చైర్మన్ గా బొల్లు రమాదేవి వైస్ చైర్మన్‌గా గోనా మరియమ్మ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్ బొల్లు రమాదేవి, వైస్ చైర్మన్ గోనా మరియమ్మ సభ్యులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.వి. శివారెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మిరెడ్డి, మాగులూరి శ్రీకాంత్, బాలగురవరెడ్డి, కంబాల రమణ, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నూతన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కందుల

పొదిలి, అక్షర ప్రకాశం : మార్కాపురం జిల్లా పట్టణంలో 20 కోట్లతో పలు అభివృద్ధి పనుల భాగంగా మంగళవారం నాడు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పలు సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు ఆంధ్ర బ్యాంక్ బజార్ మాయాబజార్ పొదిలమ్మ టెంపుల్ ప్రకాష్ నగర్ పందు హౌస్ ఇమాంస బజార్ బీసీ కాలనీ ఆర్కే రెస్టారెంట్ ఎదురు పోతారం SC కాలనీ కంబాలపాడులలో నూతన సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ రామ్మోహన్రావు కొబ్బరికాయ కొట్టి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం పొదిలి జనరల్ సెక్రటరీ పందిటి మురళి మరియు ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే కందులని సన్మానించారు.

విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతం

రంగంపేట, అక్షర ప్రకాశం : రంగంపేట మండలంలో 17 గ్రామాలలో ప్రభుత్వపాఠశాలల యాజమాన్య కమిటీ ఎన్నిక లు ప్రశాంతంగా జరిగాయని మండల విద్యాశాఖ అధికారులు కే. శ్రీనివాసరావు, పి. మధుసూదన రావులు తెలిపారు. మంగళవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, మూడు మండల ప్రజా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, 33 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయని వీటిలో 17 ఏకగ్రీవం కాగా 30 పాఠశాలకు ఎన్నికలు జరిగాయన్నారు.

కీర్తి ఐకాన్ పురస్కారం 2026కు అందుకున్న ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి

గిద్దలూరు, అక్షర ప్రకాశం : హైదరాబాదులోని బిర్లా ఆడిటోరియం నందు స్వర్ణ నంది కీర్తి ఐకాన్ పురస్కారాలు అందించారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నవారికి పురస్కారాలు 2026 కు అందించారని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు తెలిపారు. కీర్తి ఐకాన్ పురస్కారం 2026 కు గౌరవ పెద్దలు డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ఫిలిం ఛాంబర్ చైర్మన్ శ్రీమతి ఎస్ఎం రత్న విశ్రాంత సూపరిం డెంట్ గౌతమ్ రాజు ఫిలిం అండ్ టీవీ యాక్టర్ చిన్ని మిల్లి మణికుమార్ ఫిలిం డైరెక్టర్ విశ్వక్ మూవీ డైరెక్టర్ వేణులు మెగా ఈవెంట్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శిరీష రెడ్డి చేతుల మీదుగా అందుకున్నామన్నారు. గౌరవ డాక్టరేట్ అందుకున్నప్పుడు మరియు మార్కాపురం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆగస్టు 15న ప్రశంసా పత్రం అందుకున్నప్పుడు కలిగిన ఉత్సాహం అంతా ఇంతా కాదన్నారు. మనం ఈ వయసులో కూడా యువతకు ఏమాత్రం తీసిపోకుండా నిరంతరం సేవా కార్యక్రమాల్ని ఘనం గా నిర్వహించాలనే సంకల్పం ఆలోచన ఈ ప్రశంసాపత్రం, గౌరవ డాక్టరేట్ లు కలిగించాయన్నారు. రాబోవు రోజులలో కూడా తల్లిదండ్రులు చనిపోయిన బిడ్డలకు ఒక మంచి ప్లాట్ఫామ్ వేసి అన్ని రంగాలలో విద్యార్థిని విద్యార్థులను తల్లిదండ్రులు లేని లోటు తీర్చడమే కాకుండా ఒక ఉన్నత స్థాయి బిడ్డలు ఏ విధంగా అయితే చదువుతారో అలాంటి స్థాయిని బిడ్డలకు అందించాలనే సంకల్పంతో ఉన్నామన్నారు అది కొద్ది రోజులలో నెరవేరుతుంది ఇదంతా కూడా దాతల యొక్క గొప్పతనం అని గంటపదంగా చెప్పుకోవచ్చు అన్నారు.

మెగా ఈవెంట్స్ కీర్తి రెడ్డికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం పర్యటనకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు

రేపల్లె, అక్షర ప్రకాశం : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్టోబర్ 1న 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేసేందుకు బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గానికి రానున్న నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం భద్రతా ఏర్పాట్లను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్, ఐపిఎస్ ఆధ్వర్యంలో బుధవారం రేపల్లె పట్టణంలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ (ASL) నిర్వహించారు. జిల్లా కలెక్టర్ డా. వినోద్ కుమార్ వి., ఐఏఎస్, ఎస్ఎస్జీ అధికారులు, ఇతర శాఖల అధికారులతో కలిసి ఎస్పీ ముందస్తు భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. రేపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగేందుకు ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని, అక్కడ చేపడుతున్న భద్రతా చర్యలను పరిశీలించారు. అలాగే ప్రజా వేదిక, పార్టీ క్యాడర్ సమావేశం జరిగే ప్రదేశాలు, పింఛన్ లబ్ధిదారుడి నివాసానికి వెళ్లే మార్గం, వీఐపీ, వీవీఐపీ వాహనాల రాకపోకలు, ప్రజా వేదికకు వచ్చే ప్రజల వాహనాలు, పార్టీ క్యాడర్ సమావేశానికి హాజరయ్యే వారి వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ ప్రయాణించే మార్గాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించి భద్రతా ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. హెలిప్యాడ్ వద్ద బ్యారికేడింగ్ను పటిష్టంగా ఏర్పాటు చేయాలని, ముఖ్యమంత్రి కాన్వాయ్ ప్రయాణించే మార్గంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, కాన్వాయ్ మార్గంతో పాటు ఇతర కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అవసరమైన ముందస్తు భద్రతా చర్యలను పూర్తి చేయాలని ఎస్పీ సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా భద్రతా ఏర్పాట్లను పటిష్టంగా చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో చీరాల, ఏఆర్ డీఎస్పీలు అబ్దుల్ అజీజ్, కృష్ణంరాజు, ఎస్బీ ఇన్స్పెక్టర్ నారాయణ, ఎస్ఎస్జీ అధికారులు, పోలీసు అధికారులు, జిల్లాలోని ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

Published by : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. , Printed by : Nannuri Subba Rao, Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Printed at : Vijaya Printers (offset Printing), Trunk Road, Ongole Town & Mandal, Prakasam Dist, A.P. - 523001, Published from : Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Editor : Byrapuneni Srinivasarao, Door No.2-25, Vinodarayanipalem (v), Ammanabrolu (Post), N.G.Padu Mandal, Prakasam Dist. A.P. Cell : 9848997263, E.mail : aksharaprakasam@gmail.com,